
సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం । 27 । డిసెంబర్ । 2023



జ్యోతిక్షేత్రం.. భక్తజన సంద్రం

శ్రీ అవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా జ్యోతిక్షేత్రం భక్త జన సంద్రంగా మారింది. -8లో



పుష్పగిరిలో పాము

పుష్పగిరిలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పాము కలకలం సృష్టించింది. చివరికి నదికి వెళ్లే మెట్లలోకి వెళ్లింది. -8లో

గరిష్టం/కనిష్టం
30.4/21.1

వాతావరణం

జిల్లాలో మంగళవారం 21.1 – 30.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

‘న్యాక్’లో ఉచిత శిక్షణ

పులివెందుల రూరల్: పట్టణంలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్‌లో సీడాప్ వారి ఆధ్వర్యంలో అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తున్నామని న్యాక్ అకాడమి ఇన్‌చార్జి చెన్నకేశవులు మంగళవారం ఒక ప్రక టనలో తెలిపారు. రాష్ట్రంలోని యువతీయువ కుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామ ని, శిక్షణ సందర్భంగా ఉచిత వసతి, భోజనం కల్పిస్తున్నట్లు.. అలాగే శిక్షణకు అవసరమైన స్టేషనరీ, యూనిఫాం ఉచితంగా ఇస్తామ న్నారు. వివరాలకు 9885331972, 98853 31972 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో 32 సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)/ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) కాంట్రాక్ట్ పోస్టు లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి మంగళ వారం తెలిపారు. హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీ ఓవీ.ఇన్ వెబ్ సైట్ నుంచి అభ్యర్థులు దరఖాస్తులను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం భర్తీ చేసిన దరఖాస్తుతో పాటు నిర్దేశించిన రుసుమును, అవసరమైన సర్టిఫికె ట్స్‌ను జత పరచి జనవరి 12వ తేదీ సాయం త్రం 5 గంటలలోపు కడప పాత రిమ్స్‌లోని తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష



ఆలయ అధికారికి నగదును అందజేస్తున్న దాతలు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పెండ్లిమర్రి మండలం గొందిపల్లెకు చెందిన మాచవరం రామచెన్నారెడ్డి రామసుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు రమణారెడ్డి, రామాంజనేయ రెడ్డి, చంద్రహాసరెడ్డి, చెన్నారెడ్డిలు రు.1,00,116లు విరాళంగా ఇచ్చారు. ఈ సం దర్భంగా ఆలయ సహాయ కమిషనర్ అలవల పాటి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేక దర్శనం చేయించారు. తీర్థ ప్రసాదా లతో పాటు స్వామి చిత్రపటం ఇచ్చి శేషవస్త్రం తో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీలో చోటు



పుల్లయ్య రవిశంకర్ ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: మండల విద్యాశాఖ అధికా రుల అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం లో వైఎస్సార్ జిల్లా నుంచి ముగ్గురు ఎంఈఓ లకు చోటు లభించింది. ఇందులో గౌరవ అధ్య క్షుడిగా బ్రహ్మంగారిమఠం ఎంఈఓ–1గా పనిచేస్తున్న పుల్లయ్య, కోశాధికారిగా కొండా పురం ఎంఈఓ–1గా పనిచేస్తున్న ఓబులేసు, ఉపాధ్యక్షుడిగా చాపాడు ఎంఈఓ–1గా పనిచే స్తున్న రవిశంకర్‌లున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఈఓల సమస్యల పరి ష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 28, 29 తేదీలలో కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళా శాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేయాలని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి కోరారు. సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో రాష్ట్ర స్థాయి సైన్సుఫేర్ నిర్వహణపై డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరె డ్డిల ఆధ్వర్యంలో ఆయా నిర్వహక కమిటీ కన్వీ నర్లు, సభ్యులతో ఆయన మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కమిటీ సమష్టి కృషితో తమకు కేటాయించిన విధులను నిర్వర్తించి కార్య క్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని తెలి పారు. శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు తీసుకువస్తారని, వారందరినీ రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండుల నుం చి అకామిడేషన్ కమిటీ రిసీవ్ చేసుకుని అన్ని వస తులు కల్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ కమిటీ ఉదయం 7 గంటల నుంచే ప్రాజెక్టులను రిజిస్ట్రే షన్ చేసుకుని రూమ్స్‌ను కేటాయించాలన్నారు. మీల్స్ టోకన్లను కూడా అందించాలన్నారు. లాజి స్టిక్ కమిటీ సమన్వయంతో ప్రాజెక్టుల ప్రదర్శ నకు టేబుల్స్, విద్యుత్ సౌకర్యం కల్పించి విద్యా ర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడా లన్నారు. 27వ తేదీ రాత్రికే వివిధ జిల్లాల నుంచి కడపకు చాలామంది వస్తారని.. వారికి భోజనం, మంచినీరు, వసతిని ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో కడప ఎంఈఓ పాలెం నారాయణ, సీకేదిన్నె ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, వీఎన్‌పల్లె ఎం ఈఓ జాఫర్ సాదిక్‌లతో పాటు నిర్వాహక కమి టీ కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర ఆరంభం




బ్యాడ్మింటన్ ఆడుతున్న డిప్యూటీ సీఎం



కడప డీఎస్‌ఏ మైదానంలో జరిగిన కార్యక్రమానికి హాజరైనవారు



మాట్లాడుతున్న అంజద్‌బాషా



మాట్లాడుతున్న సురేష్‌బాబు

- దేశ క్రీడాచరిత్రలో మైలురాయి : ఉప ముఖ్యమంత్రి
- క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు : కడప మేయర్
- ఉత్సాహంగా ప్రారంభమైన వార్డు/ సచివాలయ స్థాయి క్రీడాపోటీలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధి కార సంస్థ మైదానంలో ‘ఆడుదాం ఆంధ్ర’ (ఇది అందరి ఆట) మెగా క్రీడా టోర్నమెంట్ మంగళ వారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథులుగా ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా, కడప నగర మేయర్ కె.సురే ష్‌బాబు, కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్‌చం ద్‌లు హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిం చగా, అనంతరం జాతీయపతాకాన్ని, క్రీడాప తాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్ బాషా మాట్లాడుతూ ఆణిముత్యాల్లాంటి క్రీడాకా రులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పోటీలు దేశంలోని క్రీడాపో టీల్లో ఒక మైలురాయిగా నిలుస్తాయన్నారు. ఈ మెగా టోర్నమెంట్ రిజిస్ట్రేషన్లలో మన జిల్లా అగ్ర స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ వరకు 47 రోజుల పాటు నిర్వ హించే ఈ పోటీల్లో చక్కటి ప్రతిభను కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగ న్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో కడపను స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామన్నారు. నగర మేయర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని తెలిపారు. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. స్పోర్ట్స్ రిజర్వేషన్ ద్వారా జిల్లాలో 275 మంది వరకు ఉద్యోగాలకు ఎంపిక కావడం క్రీడల ప్రాధాన్యతను చాటిచెబుతోందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా చక్కటి అవకాశాలు పొందవచ్చన్నారు. నగరపాలక కమిషనర్ జి.సూ ర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకా రులు సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం సత్తాచాటి విజేతలుగా నిలవాలని ఆకాంక్షిం చారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి, బెలూ న్‌లు ఎగురవేసి ‘ఆడుదాం ఆంధ్ర’ పోటీలను లాం ఛనంగా ప్రారంభించారు. అనంతరం అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని కొద్దిసేపు ఆట లాడి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమం లో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునిల్‌కు మార్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్. సమరనాథరెడ్డి, డిప్యూటీ మేయర్‌లు ముంతాజ్ బేగం, బి.నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు సూర్యనా రాయణరావు, మల్లికార్జున, ఎస్‌ఎండీ షఫీ, బసవ రాజు, షంషీర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్య దర్శులు టి.కె.అఫ్జల్‌ఖాన్, రాయల్‌బాబు, నగర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు తోటకృష్ణ, కరీ ముల్లా, బంగారునాగయ్య యాదవ్, ఇబ్రహీం, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీఎస్‌డీఓ జగ న్నాథరెడ్డి, కార్పొరేటర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, డీఎస్‌ఏ కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యా యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా,నగర మేయర్ కె. సురేష్‌బాబు తదితరులు

పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి

డీఆర్వో గంగాధర్ గౌడ్



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు.. జనవరి 2, 3 తేదీల్లో నిర్వహించే డిపార్టుమెంటల్ పరీ క్షలు, 4వ తేదీ జరిగే పాలిటెక్నిక్ లెక్చరర్ల పరీక్ష లను కట్టుదిట్టంగా నిర్వహించాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిపార్టు మెంటల్ పరీక్షలు ఉదయం 10.00 నుంచి 12.00, మధ్యాహ్నం 3.00 నుంచి 5.00 గం టల వరకు రెండు విభాగాలుగా నిర్వహిస్తామ న్నారు. పాలిటెక్నిక్ లెక్చరర్ల పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థు లకు పరీక్షా కేంద్రాల్లో ఉదయం 8.00 నుంచి 9.00 గంటల వరకు, మధ్యాహ్నం 1.00 నుం చి 2.00 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. మాల్ ప్రాక్టీస్ కార్యకలాపా లకు తావు లేకుండా చూడాలన్నారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంగా పనిచేసి పరీ క్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. పోలీసుశాఖ ప్రతి పరీక్షా కేంద్రంలో గట్టి బం దోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేం ద్రాల యాజమాన్యాలు వసతులు కల్పించాల న్నారు. సీకే దిన్నె మండల పరిధిలో అన్నమా చార్య ఇంజినీరింగ్ కళాశాల, ప్రొద్దుటూరులో సాయి రాజేశ్వరి, వాగ్దేవి, చైతన్యభారతి ఇంజి నీరింగ్ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా నిర్ణ యించామన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎ స్సీ పరీక్షల ప్రత్యేక అధికారులు బాబురావు, విజయ్‌కుమార్, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూప రింటెండెంట్లు పాల్గొన్నారు.

త్వరగా పనులు పూర్తికాకపోతే చర్యలు

గండి ఆలయ నిర్మాణం ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనుల ఆలస్యంపై జిల్లా కలెక్టర్ విజయరా మరాజు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘అక్టో బర్ అంటారు.. డిసెంబర్ అంటారు.. పనులు చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఎందుకు ఆలస్యం అవుతున్నాయి’ అంటూ దేవదాయశాఖ డీఈ గంగయ్య, కాంట్రాక్టర్‌లపై మండిపడ్డారు. పాడా ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డి, పులివెందుల ఆర్డీవో వెం కటేశులుతో కలసి మంగళవారం ఆయన గండిలో అభి వృద్ధి పనులను పరిశీలించారు. ‘రాజ గోపురం పనులు పూర్తి కాలేదు, ఆలయ నిర్మాణ పనులు కొదవే ఉన్నాయి.. ప్రహరీ ఊసే లేదు, మిగిలిన పనులు పూర్తి కాలేదు’ అంటూ నిలదీశారు. త్వరలో మళ్లీ ముఖ్య మంత్రి పర్యటన ఉంటుందని, జనవరి నెలాఖరు నాటికి పనులు పూర్తి కాక పోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతకుముందు వారికి ఆలయ అధికారి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో సంప్రదా యబద్ధంగా స్వాగతం పలికి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కాబోయే ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, తహసీల్దార్ రాజసింహనరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

వేంపల్లె : అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి జాప్యం చేయవద్దని కలెక్టర్ విజయరామరాజు సంబం ధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లను మంగళవారం ఆదేశించారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ మెమోరి యల్ పార్కు, ట్రిపుల్ ఐటీ కంప్యూటర్ ల్యాబ్స్, వేంప ల్లెలోని డిగ్రీ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల, రోడ్ల విస్తరణ పనులు, యూజీడీ, నాలుగు రోడ్ల కూడలి, ఆర్‌అండ్‌బీ కొత్త భవనం, రైతు బజార్ల పను లను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృ ద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీ త సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే నెల సీఎం జిల్లా పర్యటనలో భాగంగా వీటి ప్రారంభో త్సవాలు ఉండేలా చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు, పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈ సిద్దారెడ్డి, డీఈ సుబ్రమణ్యకుమార్, విద్యుత్ డీఈఈ శ్రీకాంత్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఈఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గండిలో ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

వేగం పెంచండి

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులలో వేగం పెం చాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పులివెందులలో జరుగు తున్న అభివృద్ధి పనులను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉలిమెల్ల చెరువు నిర్మాణ పనులను పరిశీలించి నాణ్య తగా చేపట్టాలని అధికారులకు సూచించారు. మెయిన్ బజార్‌లోని సెంట్రల్ బోలేవార్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహా గురుకులం ప్రారంభం

రూ 21కోట్లతో నిర్మించిన మహాగురుకులం పాఠశాల ప్రారంభం

బ్రహ్మంగారిమఠం: మండలంలోని తోట్లపల్లె దగ్గర రూ.21 కోట్ల నిధులతో నిర్మించిన మహా గురుకులం ఉన్నత పాఠశాల భవనాలను కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మైదు కూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలుచోట్ల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి వినతులు స్వీకరించారు. అంతకుముందు నాయకులకు ఎంపీపీ వీరనారాయ ణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మీదేవి, ఎంపీటీసీ ఓబుల్‌రెడ్డి, కాంట్రా క్టర్ శేఖర్‌రెడ్డి, అధికారులు ఘన స్వాగతం పలికారు.

బి.మఠంలో..

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో రూ.5.60 కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభ ోత్సవాల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టి పల్లె రఘురామిరెడ్డిలు పాల్గొన్నారు. పోలేరమ్మగుడి దగ్గర ప్రహరీ, షాపింగ్ కాంప్లెక్స్, ఉత్తరద్వారం దగ్గర సుందరీకరణ, గోకులం, డార్మిటరీ, కళ్యాణక ట్టలు ప్రారంభించారు. ప్రాకారం, ఫ్లోరింగ్ నిర్మాణం వంటివాటికి భూమిపూజ చేసారు. అనం తరం బ్రహ్మంగారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు దేవస్థానం పిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, పూర్వపు మఠాధిపతి కుమారులు ఆలయ సంప్ర దాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నేల టూరు సుబ్బారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మం డలి ఛైర్మన్ తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యానవన సలహా దారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్‌యార్డు ఛైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్ర, బి.మఠం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మేకల రత్నకు మార్ యాదవ్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు చిలేకాంపల్లె నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహా గురుకులం ఉన్నత పాఠశాల ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు

ఆలయ నిర్మాణానికి రూ.25 లక్షలు

బ్రహ్మంగారిమఠం: మైదుకూరు–బద్వేల్ జాతీయ రహదారిలో ఉన్న రాణీబావి దగ్గర వెలసిన గం గమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణం కోసం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిల చేతుల మీదుగా బి.మఠంలో ఎండోమెంట్ ఏసీ శం కర్ బాలాజీకి ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ రూ.25 లక్షల చెక్కును మంగళవారం అందించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని, గంగమ్మ గుడికి రూ.1కోటి నిధులు మంజూరు చేశారన్నారు. తన సొంత పంచాయతీలోని ఈ గుడి అభివృద్ధి కోసం కార్పస్ ఫండ్‌గా రూ.25లక్షలు ఇచ్చానన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల శివయాదవ్, గంగమ్మగుడి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న దృశ్యం

రామయ్య ఆశీస్సులతో జగన్ మళ్లీ సీఎం కావాలి

- జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఒంటిమిట్ట/రాజంపేట/రాజంపేట రూరల్ : ఒంటి మిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆశీస్సులతో వైఎ స్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో 175కు 175 అసెంబ్లీ సీట్లు గెలిచి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. ఆయన మంగళవారం చేపట్టిన 9వ ఒంటి మిట్ట మహాపాదయాత్ర భక్తిపారవశ్యంతో కొనసా గింది. రాజంపేట మండల పరిధిలోని ఆకేపాడు శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయాల సముదాయం లోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సతీమణి జ్యోతమ్మ కలిసి పూజలు చేశారు. అనంతరం సతీస మేతంగా పాదయాత్రను ప్రారంభించారు. వారి వెం ట ఆకేపాడు గ్రామాలలోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు కదలివచ్చారు. ఒక వైపు మంచు కురుస్తున్నా.. చలిని లెక్కచేయకుండా పాద యాత్రలో పాల్గొని భక్తిభావం చాటుకున్నారు. వైఎ స్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకేపాటి అనిల్‌కు మార్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర సాగింది. నంద లూరులో నాయకులు సిద్దవరం గోపిరెడ్డి, అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, గడికోట వెంకటసుబ్బారెడ్డి, గీతాల నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, అరిగెల మణి, అరిగెల హరిబాబు, గుండు మల్లికార్జునరెడ్డి, పల్లె గ్రీస్మంత్‌రెడ్డి, అన్నం నాగేంద్ర, జుల్ఫీకర్ ఘన స్వాగతం పలికారు. ఒంటిమిట్ట మండలంలోని మం టపంపల్లె వద్ద డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జై చంద్రరెడ్డి కలిసి పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఒంటిమిట్టలో కడప మే యర్ సురేష్‌బాబు, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహా దారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి స్వాగతం పలి కారు. కోదండరామస్వామి ఆలయానికి చేరుకున్న తర్వాత ఆకేపాటి తల నీలాలు సమర్పించి, స్వామిని దర్శించుకున్నారు. రంగమండపంలో ఆల య అధి కారులు సత్కరించారు. అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆకేపాటి పాదయాత్రలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్



కోదండ రామాలయంలో ఆకేపాటి దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మార్చి 10 నుంచి గంగమ్మ జాతర



లక్కిరెడ్డిపల్లి : మార్చి 10 నుంచి 12 వరకు శ్రీ అనంతపురం గంగమ్మ తిరునాల నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జరిగిన వేలం పాటలో రూ.21 లక్షల 34 వేల ఆదాయం వచ్చింది. టోల్‌గేట్‌లో రూ.5.20 లక్షలు, తలనీలాలు రూ.1.51 వేలు, విడి దినాల్లో టెం కాయల విక్రయం రూ.8.52 లక్షలు, షామియానా సప్లయర్స్‌ను రూ.6.11 లక్షలకు దక్కించుకున్నారు. నాలుగింటికి సరియైన వేలం పాట రాకపోవడంతో తరువాత వేస్తామని ఆలయ ఛైర్మన్ సామాల నరసిం హారెడ్డి, ప్రత్యేక అధికారి రవీందర్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి జనార్దన్, సర్పంచ్‌లు సామాల వెంకటనారాయణ రెడ్డి, గడ్డం ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు ఉడుము సుబ్బరాయుడు, ఉప్పుతోట సుబ్బయ్య, పూజారి ఆదిమూలంరెడ్డి శేఖర్, రామచంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వల్లూరు : పుష్పగిరి పుణ్య క్షేత్రంలో పౌర్ణమిను పురస్కరించుకుని మంగళవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలి వచ్చిన భక్తులు పుష్పగిరి కొండకు కొబ్బరి కాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ, శ్రీ సంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. పెన్నా నదిలో స్నానాలు ఆచరించారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు తాగు నీటి సౌకర్యాలను కల్పించారు.

భర్త మందలించాడని ఆత్మహత్య



మృతి చెందిన జ్యోతి

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డి పల్లె గ్రామంలో నివాసముంటున్న మేకల జ్యోతి (27) అనే మహిళ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మేకల జ్యోతి, ఆమె భర్త మేకల ఆనందబాబు కొండాపురం మండలం బుక్కపట్నం నుంచి బతుకు దెరువు కోసం పిల్లలతో కలిసి నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వచ్చారు. అక్కడ ఒక హాస్టల్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం.. భర్త మందలించడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా

లింగాల : ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. వివరాలిలా.. లింగాలలో మంగళవారం నిర్వహించిన శ్రీ కాశిరెడ్డి నాయన ఆరాధనలో స్థానిక ఎస్సీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత వారు ట్రాక్టర్‌లో తిరుగు పయనమయ్యారు. మార్గ మధ్యంలో మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో లింగాలకు చెందిన ఎం.వెంకటేష్, కాంతమ్మల కుమారుడు అరుణ్‌కుమార్ ఎడమ కాలు ట్రాక్టర్ ట్రాలీ కింద పడి నుజ్జునుజ్జయింది. అలాగే ఈ ప్రమాదంలో కొంత మంది పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన విద్యార్థులను 108 వాహనంలో పులివెందుల, లింగాల ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

జ్యోతిక్షేత్రం.. భక్తజన సంద్రం



పూలతో అలంకరించిన కాశినాయన సమాధి



దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన జ్యోతిక్షేత్రం

- వైభవంగా కాశినాయన ఆరాధన మహోత్సవాలు
- నేడు రథోత్సవం, జ్యోతి ప్రజ్వలన

కాశినాయన : శ్రీ అవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులతో జ్యోతిక్షేత్రం పోటెత్తింది. కాశినాయన నామస్మరణతో నల్లమల్ల కొండలు మార్మోగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలు ఏర్పాటు చేసి కాశినాయన దర్శనం కల్పిస్తున్నారు. జ్యోతిక్షేత్రానికి చేరుకునేందుకు మైదుకూరు ఆర్టీసీ డిపోవారు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. దాదాపు రెండు లక్షల మంది భక్తులు ఆరాధనకు వస్తారని ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. భక్తుల సంఖ్యకు దీటుగా భోజనవసతి, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. జ్యోతి క్షేత్రం భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అంతేకాకుండా భక్తులు స్వచ్ఛందంగా సుమోలు, ఆల్విన్, లారీలు, ఆటోల్లో వస్తున్నారు. మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి కాశినాయన జ్యోతిస్వరూపం దర్శనమివ్వనుంది.

భారీ బందోబస్తు

ఆరాధన మహోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోరుమామిళ్ల సీఐ చిరంజీవి ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 175 మంది పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

స్వచ్ఛందంగా ధాన్యం, కూరగాయలు

కాశినాయన ఆరాధనకు భక్తులు స్వచ్ఛందంగా ధాన్యం, కూరగాయలు, నగదు సమర్పిస్తున్నారు. ఆరాధనకు అవసరమయ్యే 140 క్వింటాళ్ల బియ్యానికి రెట్టింపుతో ధాన్యాన్ని భక్తులు సమర్పించారు. అలాగే స్వచ్ఛందంగా కూరగాయలను భక్తులు సమర్పిస్తున్నారు. చాగలమర్రి, ఆళ్లగడ్డ ప్రాంతాలకు చెందిన దాదాపు 200 మంది వంట మనుషులు ఇక్కడి భక్తులకు రుచికరమైన వంటలు చేస్తున్నారు.

నేడు రథోత్సవం, జ్యోతిప్రజ్వలన

బుధవారం కాశినాయన రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో కాశినాయన మాల ధరించిన భక్తులు పాల్గొంటారు. అనంతరం కాశినాయన జ్యోతిస్వరూపం దర్శనమిస్తుంది. దీనిని చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా పలు సర్టిఫికెట్లు సత్వరమే అందుతున్నాయి. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అమ్మ ఒడి మాకెంతో ఆసరా



మాది మైదుకూరు పట్టణం. మేము 6వ వార్డులోని కొత్తకొట్టాలు ప్రాంతంలో ఉంటున్నాం. నా భర్త గఫార్ ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మాకు ముగ్గురు పిల్లలు. అమ్మాయి అనీషా ఫర్జానా నాలుగో తరగతి, అబ్బాయి వసీం మూడో తరగతి చదువుతున్నారు. రెండో అబ్బాయికి స్కూల్ వయసు రాలేదు. నా భర్త సంపాదనతోనే మా కుటుంబం గడవాలి. పిల్లల పోషణ, ఇద్దరు పిల్లలను చదివించడం మాకు ఇబ్బందిగా ఉండేది. ఈ పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి కింద తల్లుల ఖాతాల్లో వేస్తున్న రూ.15వేలు సాయం మమ్మల్ని ఎంతో ఆదుకుంటోంది. అమ్మాయి చదువుకు ఈ సొమ్ము ఆసరాగా మారింది. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న ఈ పథకం అండగా పిల్లలను బాగా చదివించాలనుకుంటున్నాం. ఇప్పటికి నాకు మూడు దఫాలుగా అమ్మ ఒడి సాయం అందింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యావాదాలు.

- షేక్ ఆయిషాబీ, మైదుకూరు

జగనన్న ప్రభుత్వంలో సొంత ఇల్లు వచ్చింది



మేము ప్రొద్దుటూరు పట్టణంలోని రామేశ్వరంలో నివాసం ఉంటున్నాం. భర్త రవితోపాటు కుమారులు క్షౌరశాలను నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పటి వరకు మాకు సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాం. ముఖ్యమంత్రి జగన్ పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో మాకు రామేశ్వరం జగనన్న కాలనీలో ఇంటి స్థలం వచ్చింది. ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇచ్చింది. ఇంత కాలానికి సొంత ఇల్లు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. జగనన్నను ఎప్పటికీ మరచిపోలేం.

- శ్రీదేవి, ప్రొద్దుటూరు

పుష్పగిరి ఆలయంలో పాము కలకలం



ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు పక్కన పడగ విప్పిన తాచు పాము

వల్లూరు : పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం తాచు పాము కలకలం సృష్టించింది. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో అర్చకులు తెల్లవారుజామున ధనుర్మాస పూజలను నిర్వహించే క్రమంలో ఆలయ ప్రాంగణంలోని శ్రీ రాజ్య లక్ష్మీ అమ్మవారి ఆలయం ఎదుట ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లారు. స్వామి వారి మూలవిరాట్‌కు వెనుక వైపున తాచు పాము ఉండడాన్ని గుర్తించారు. దాంతో బయటికి వచ్చిన అర్చకులు పాములు పట్టే నిపుణులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దాదాపు గంట సేపు పామును పట్టేందుకు ప్రయత్నించారు. పాము పడగ విప్పి బుసలు కొడుతూ చాలా సేపు అలాగే ఉండి పోయింది. సమీపంలోని పూజా పాత్రలను పడగతో బలంగా కొడుతూ నిలిచింది. చివరకు అతి కష్టం మీద పాములు పట్టే వారు పామును ఒక డబ్బాలోకి తరలించారు. అక్కడి నుండి బయటికి తీసుకొస్తుండగా నది నుంచి ఆలయంలోకి వచ్చే మెట్లపై కిందికి దూకి అక్కడి నుంచి జారుకుంది. దీంతో అర్చకులతో బాటు భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ పాము సాధారణ తాచు పాముకు భిన్నంగా పడగపై తెల్లని చారలతో కొత్త రకంగా ఉందని భక్తులు తెలిపారు. కొండపై ఉన్న ఆలయంలో పాములు అడపా దడపా కనిపించినప్పటికీ ఇలాంటి కొత్త రకం పామును చూడడం ఇదే మొదటి సారని పురావస్తు శాఖ సిబ్బంది తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి విద్యార్థి మృతి



జశ్వంత్ కుమార్ మృతదేహం

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని చిన్న నాగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాపాఘ్ని నగర్‌కు చెందిన ఇళ్లగాల్ల జశ్వంత్ కుమార్ (14) అనే విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పాపాఘ్ని నగర్‌కు చెందిన జస్వంత్ వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నాడు. సెలవు దినాల్లో అప్పుడప్పుడు వ్యవసాయ కూలిపనులకు వెళుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలోని మరో ముగ్గురు యువకులతో కలిసి చిన్న నాగిరెడ్డిపల్లె పొలాలకు మినుము పంట కోతకు వెళ్లాడు. అక్కడ పని ముగిసిన అనంతరం ట్రాక్టర్‌కు వెనుక వైపు మినుము నూర్పిడి యంత్రాన్ని కట్టుకుని దానిపై కూలీలు కూర్చున్నారు. పొలాల నుండి తిరిగి వచ్చే క్రమంలో వేగంగా వస్తున్న ట్రాక్టర్ చిన్ననాగిరెడ్డి పల్లె సమీపంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో మినుము నూర్పిడి యంత్రం బోల్తా పడింది. దానిపై కూర్చున్న కూలీలు కింద పడ్డారు. వారిలో జశ్వంత్ కుమార్‌పై ట్రాక్టర్ పడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు, స్థానికులు చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని తండ్రి ఇళ్లగాల్ల లక్షుమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

35 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- తమిళ కూలీ అరెస్టు
- మరో ఏడుగురు పరారీ



పట్టుబడిన నిందితుడు, ఎర్రచందనం దుంగలతో రేంజర్ కళావతి, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం ఫారెస్టు రేంజ్‌లోని సిద్దవటం బీటు ఎద్దుల గుండాలు అటవీ ప్రదేశంలో 35 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఒక తమిళ కూలీని అరెస్టు చేసినట్లు సిద్దవటం ఫారెస్టు రేంజర్ బి. కళావతి తెలిపారు. సిద్దవటంలోని అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. లంకమల అభయారణ్యంలోని సిద్దవటం బీటులో సోమవారం తమ సిబ్బందితో కలిసి కూంబింగ్ నిర్వహించామన్నారు. ఎద్దుల గుండాలు అటవీ ప్రదేశంలో మొద్దులు కింద పడేసే శబ్దం వినిపించడంతో తమ సిబ్బంది అప్రమత్తమయ్యారన్నారు. తమను చూసి కూలీలు పారిపోతుండటంతో తాము దాడి నిర్వహించి ఒక కూలీని అదుపులోకి తీసుకున్నామన్నారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అక్కడ లభ్యమైన 35 ఎర్రచందనం దుంగలను, రెండు రంపాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దుంగల బరువు 509 కిలోలు ఉండగా, వీటి విలువ రూ.2.37 లక్షలు చేస్తుందన్నారు. పట్టుబడిన తమిళ కూలీని విచారించగా తాము మొత్తం 8 మంది వచ్చామని తెలిపాడన్నారు. తాము అరెస్టు చేసిన తమిళ కూలీ ధర్మపురి జిల్లా, శిట్టేరి గ్రామానికి చెందిన పెరుమాల్ సుబ్రమణి అని గుర్తించామన్నారు. ఈ మేరకు నిందితుడిని తిరుపతి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేసు, ఫారెస్టు బీటు అధికారి పెంచల్‌రెడ్డి, అసిస్టెంటు బీటు అధికారులు హైమావతి, నారాయణరెడ్డి, బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త, అత్తపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బెల్లంమండివీధికి చెందిన రేష్మా (30) అనే మహిళ తన భర్త షేక్ కరీముల్లా, అత్త అఫ్రఫున్నీసాలపై ఫిర్యాదు చేసింది. ఐదు నెలల క్రితం షేక్ కరీముల్లాకు, రేష్మాకు వివాహమైంది. వివాహ సమయంలో కట్నం కింద ఏడుతులాల బంగారు ఆభరణాలను, 1.50 లక్షల నగదును ఇచ్చారు. కరీముల్లా పాన్‌షాపులో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన భార్యకు తన కంటే ఎక్కువ వయసు ఉందని ఆమెను మానసికంగా వేధించేవాడు. దీనికి తోడు మరో రూ. 2లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని తల్లితో కలిసి శారీరకంగా, మానసికంగా హింసించడం మొదలు పెట్టాడు. దీంతో భర్త, అత్త వేధిస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

విధి నిర్వహణలో జిల్లా ఆస్పత్రి ఉద్యోగి మృతి

మదనపల్లె : విధి నిర్వహణలోనే జిల్లా ఆస్పత్రి ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో జరిగింది. చిత్తూరు పట్టణానికి చెందిన చంద్రయ్య కుమారుడు ఎస్.రామాంజులు(42) వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీలో స్థిరపడ్డాడు. అతనికి భార్య ఉషారాణి, ఇద్దరు కుమార్తెలున్నారు. వృత్తిరీత్యా జనరల్ డ్యూటీ ఆపరేటర్ (ఎంఎన్‌ఓ)గా పని చేస్తున్నాడు. వాల్మీకిపురం, పీలేరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించాడు. గత జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇక్కడికి వచ్చాడు. మంగళవారం ఆస్పత్రి విధుల్లో ఉండగా మధ్యాహ్నం ఛాతీలో నొప్పిగా ఉందని తన సహచరులకు చెప్పి అక్కడే ఉన్న ఫలంగా అపస్మారస్థితికి చేరుకున్నాడు. చికిత్స అందించేలోగానే మృతి చెందాడు. ఈ విషయాన్ని ఆస్పతి సిబ్బంది వాల్మీకిపురంలోని కుటుంబ సభ్యులకు తెలిపారు. అప్పటి వరకు తమతో పాటు పని చేసిన సహచరుడు మృతి చెందడంతో తోటి ఎంఎన్‌ఓలు, ఆస్పత్రి సిబ్బంది విషాదంలో మునిగిపోయారు. మృతుని భార్య ఆస్పత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమైంది. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

జాతీయ తైక్వాండో పోటీలలో సత్తా చాటిన ఆర్టీపీపీ విద్యార్థులు



పతకాలు సాధించిన డీఏవీ స్కూల్ విద్యార్థులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్ విద్యార్థులు జాతీయ తైక్వాండో పోటీలలో సత్తా చాటారు. ఏకంగా మూడు బంగారు పతకాలు, ఒక వెండి పతకం, నాలుగు కాంస్య పతకాలను విద్యార్థులు సాధించి జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని చాటారని ఆర్టీపీపీ డీఏవీ స్కూల్ తైక్వాండో కోచ్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్కూల్‌లో జరిగిన సమావేశంలో విద్యార్థులు సాధించిన మెడల్స్‌ను పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా తైక్వాండో కోచ్ చంద్రశేఖర్ మాట్లాడుతు ఈ నెల 22, 23, 24 తేదీలలో విజయవాడలో సీహెచ్‌ఆర్‌కే స్టేడియంలో 38వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలలో దేశంలోని 13 రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పోటీ పడ్డారన్నారు. ఈ పోటీలలో మన రాష్ట్రం నుంచి డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్ విద్యార్థులు మనోజ్, శివదార్శిక, అరోహి, కౌశల్, సాత్విక, కార్తీక్, కార్తీకేయ, సృజన్ పాల్గొన్నారు. మనోజ్, శివదార్శిక, అరోహిలు బంగారు పతకాలు సాధించగా, కౌశల్ వెండి పతకం, సాత్విక, కార్తిక్, కార్తీకేయ, సృజన్‌లు కాంస్య పతకాలు సాధించారన్నారు. స్కూల్ ప్రిన్సిపల్‌తో పాటు జాతీయ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీవీ ప్రసాద్, జాతీయ తైక్వాండో గ్రాండ్ మాస్టర్ బీవీ రమణయ్యలు విద్యార్థులను అభినందించారు.



గోడను ఢీకొన్న కారు



గోడను ఢీ కొట్టి అక్కడే ఆగిన కారు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రహరీని మంగళవారం సాయంత్రం కడపకు చెందిన కారు బలంగా ఢీ కొట్టింది. ముళ్లకంచె, ప్రహరీ బలంగా ఉండి అడ్డుకోవడంతో కారు అక్కడే ఆగిపోయింది. విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉండేది. అదృష్టం బాగుండి కారుకు నష్టం జరిగిందే కానీ లోపలున్న వారికి ఎవరికీ ఏమీ కాలేదు. కడపకు చెందిన దాసు అనే వ్యక్తి, కలసపాడు చర్చికి వెళ్లి వస్తూ అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. కారు లోపల మహిళలు, పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఎవరూ ఈ ప్రమాదంలో గాయపడలేదు.

రైలు ఇంజిన్ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ములకల చెరువు : రైలు ఇంజిన్‌కింద పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ములకలచెరువు మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కదిరి రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శివారెడ్డి కథనం మేరకు.. కురబలకోట–తుమ్మనగుట్ట రైల్వే స్టేషన్ల మధ్యలో మధ్యాహ్నం తిరుపతి నుంచి గుంతకల్కు వెళ్లే ప్యాసింజర్ రైలు ఇంజన్‌లో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. రైలు తరలించేందుకు గుంతకల్లు నుంచి వస్తున్న రైలింజన్ ములకలచెరువు స్టేషన్ వద్దకు రాగానే గుర్తుతెలియని వ్యక్తి ఇంజన్ కిందపడి చనిపోయాడు. గమనించిన రైల్వే అధికారులు కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నల్ల ప్యాంటు, తెల్ల షర్టు ధరించి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ దారుణ హత్య



మృతురాలు శిల్ప

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట పరిధిలోని మంగంపేట అగ్రహారం వద్ద ఆవులకుంట్ల శిల్ప (35) అనే మహిళ హత్యకు గురైంది. పోలీసుల కథనం మేరకు శిల్పకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భర్తతో విభేదాల కారణంగా విడాకులు తీసుకుంది. ఈ నేపథ్యంలో మంగంపేటకు చెందిన ఆటో డ్రైవర్ షఫీని నాలుగు నెలల క్రితం వివాహం చేసుకుంది. మంగళవారం భర్తకు భోజనం పెట్టి గ్రామ సమీపంలోని స్కూల్ వద్దకు వెళ్లింది. కాసేపట్లోనే రక్త గాయాలతో శవమై తేలింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెను ఎవరు చంపారు అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం



కల్యాణ దంపతులైన ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతా సమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి, నూతన పట్టువస్త్రాలు ధరింపజేశారు. తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సతీసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

చిట్టితల్లీ.. నీవులేని లోకంలో నేనుండలేను.!

కూతురి మరణాన్ని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య



మల్లేష్ (ఫైల్)

ఒంటిమిట్ట : పురుడు పోసుకున్న నెలరోజులకే పండంటి బిడ్డ తన కళ్లెదుటే కన్నుమూయడంతో ఆ తండ్రి హృదయం తట్టుకోలేకపోయింది. పసికందును మృత్యువు కబళించడంతో తీవ్ర వేదనకు గురయ్యాడు. చిట్టితల్లీ నీవు లేని లోకంలో నేనుండలేను అంటూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ హృదయ విదారక సంఘటన ఒంటిమిట్ట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కమలాపురం మండలం, పుట్టంపల్లి గ్రామానికి చెందిన మేకల మల్లేష్ అలియాస్ శేఖర్ (28), మల్లేశ్వరి దంపతులకు ఏడాది క్రితం వివాహమైంది. నెలన్నర క్రితం మల్లేశ్వరి ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కాని కొన్ని అనారోగ్య కారణాల వల్ల బిడ్డ ఆరు రోజుల క్రితం చనిపోయింది. దీంతో తీవ్ర వేదనకు గురైన మల్లేష్ సోమవారం తన అవ్వగారి ఊరైన ఒంటిమిట్ట మండలం, నందానగర్‌లోని ఎస్టీ కాలనీకి వచ్చాడు. అదే రోజు అతను తన తాతతో కలిసి మేకలు మేపుకునేందుకు నందానగర్ గ్రామ శివారులోకి వెళ్లాడు. తాత ముందుగానే ఇంటికి చేరుకున్నాడు. సాయంత్రం ఐదు గంటలు కావస్తున్నా మేకలను తీసుకుని మల్లేష్ ఇంటికి రాకపోవడంతో తాత గ్రామ శివారులోకి వెళ్లి చూశాడు. అక్కడ కింద పడి ఉన్న మల్లేష్ నోట్లో నుంచి నురగ కారుతుండటం కనిపించింది. వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు.